నమస్తే తెలంగాణ

# రాజన్న సిరిసిల్ల

12 | కరీంనగర్, శనివారం 25 జనవరి 2025 | RAJANNA SIRCILLA


## ఇండ్ల జాబితాలో నా పేరేదీ?

### రంగసాగర్‌లో పురుగుల మందు డబ్బాతో గ్రామస్తుడి నిరసన



పురుగుల మందు డబ్బాతో నిరసన తెలుపుతున్న శంకరయ్య

సారంగాపూర్, జనవరి 24: బీర్‌పూర్ మండలం రంగసాగర్‌లో గ్రామసభ నిర్వహించారు. ఆయా పథకాలకు సంబంధించిన అర్హుల జాబితాను అధికారులు చదువుతుండగా, అనర్హులను ఎలా ఎంపిక చేశారంటూ గ్రామస్తులు నిలదీశారు. భూమి ఉన్న వారిని కూడా ఆత్మీయ భరోసా పథకానికి ఎంపిక చేశారంటూ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో తమ పేర్లు ఎందుకు రాలేదని బోడ సాగర్, సంగ శంకరయ్య అధికారులను నిలదీశారు. శంకరయ్య పురుగుల మందు డబ్బాతో నిరసన తెలిపాడు. గ్రామస్తులు, అధికారులు నచ్చజెప్పడంతో డబ్బాను పడేశాడు. విషయం తెలుసుకున్న పోలీస్ సిబ్బంది గ్రామానికి చేరుకుని గొడవను సద్దుమణిగింప చేశారు. జాబితాల్లో పేరు రానివారు మరోసారి దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు.



గ్రామసభలో ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు సమక్షంలోనే కుర్చీలను విసిరి వేస్తున్న కాంగ్రెస్ నేతలు

# గ్రామ సభల్లో ఘర్షణలు

- కోరుట్ల నియోజకవర్గంలో కాంగ్రెస్ కార్యకర్తల అత్యుత్సాహం
- ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్లతో వాగ్వాదం
- ఆగ్రహించిన లబ్ధిదారులు, బీఆర్ఎస్ శ్రేణులు
- ఇవేం సభలంటూ మండిపాటు



కోరుట్ల రూరల్: పైడిమడుగులోని గ్రామసభలో గొడవ పడుతున్న బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తలు

మల్లాపూర్/మారుతీనగర్/కోరుట్ల రూరల్, జనవరి 24: కోరుట్ల నియోజకవర్గంలో శుక్రవారం నిర్వహించిన గ్రామ, వార్డు సభల్లో కాంగ్రెస్ కార్యకర్తలు అత్యుత్సాహం చూపారు. ఆయాచోట్ల సభలకు హాజరైన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్లతో వాగ్వాదానికి దిగారు. కోరుట్ల రూరల్ మండలం పైడిమడుగులో ఎమ్మెల్యే మాట్లాడుతుండగా.. కాంగ్రెస్ నాయకులు గొడవకు దిగారు. దీంతో బీఆర్ఎస్ నాయకులు అడ్డుకోగా, ఇరువర్గాల నాయకులు ఘర్షణకు దిగారు. మెట్‌పల్లి పట్టణంలోని 21వ వార్డుసభకు కాంగ్రెస్ కోరుట్ల ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావును పిలువాలంటూ లొల్లిలొల్లి చేశారు. మల్లాపూర్ సభలో ప్రొటోకాల్ ప్రకారం ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల ఫ్లెక్సీ ఎందుకు పెట్టలేదని బీఆర్ఎస్ శ్రేణులు అధికారులను నిలదీశారు. ఈ క్రమంలో కాంగ్రెస్ నేతలు కలుగజేసుకోని, గొడవకు దిగారు. ఇరువర్గాల మధ్య గంటకు పైగా తోపులాట జరిగింది. పోలీసుల జోక్యంతో సద్దుమణిగింది. అయితే ఆయాచోట్ల సభలను చూసిన ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇవేం గ్రామ సభలంటూ మండిపడ్డారు. గ్రామ సభలు.. కాంగ్రెస్ పార్టీ సభల్లా ఉన్నాయని ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం అధికారంలో ఉందని ఇష్టంవచ్చినట్లు మాట్లాడడం సరికాదని, ప్రజలను ఇబ్బందులకు గురి చేయవద్దంటూ మండిపడ్డారు.



మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్



సిరిసిల్ల మున్సిపల్ పాలకవర్గ సభ్యులను సన్మానిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్

# ఆదర్శంగా తీర్చిదిద్దాం

"2014కు ముందు సమైక్యాంధ్ర పాలనలో మున్సిపాలిటీలు ఎలా ఉన్నాయి.. బల్దియా అంటే తిన్నామా.. తాగినమా.. పోయినమా.. అనే మాదిరిగా ఉండేవి. 2014 తర్వాత కేసీఆర్ సీఎం అయ్యాక మున్సిపాలిటీలు ఎలా అభివృద్ధి చెందాయో ప్రజలందరికీ తెలుసు. ప్రణాళికాబద్ధంగా పల్లె, పట్టణ ప్రగతితో పాటు విధులు, నిధులు కేటాయించి ఆదర్శంగా తీర్చిదిద్దాం. తొమ్మిదన్నరేండ్ల కాలంలోనే తెలంగాణ మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చింది. దేశంలో తెలంగాణ జనాభా 3 శాతమే. కానీ, జాతీయ స్థాయిలో మన మున్సిపాలిటీలకు అనేక అవార్డులు రావడం గర్వకారణం. ఇది నేను చెబుతున్నది కాదు. కేంద్ర ప్రభుత్వమే అవార్డులు ఇచ్చి సత్కరించింది. పాలకవర్గాల సమష్టి కృషితోనే సాధ్యమైంది."

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

- కేసీఆర్ హయాంలోనే మున్సిపాలిటీలకు జాతీయ స్థాయిలో గుర్తింపు
- 3 శాతం ఉన్న తెలంగాణలో 30 శాతం అవార్డులు సాధించాం
- కేంద్ర ప్రభుత్వమే అందించి సత్కరించింది
- విధులతో పాటు నిధులను అందించింది కేసీఆర్ సర్కారే
- రాబోవు మున్సిపల్ ఎన్నికల్లో మరోసారి గులాబీ జెండా ఎగరేద్దాం
- పదవి లేకపోయినా ప్రజల్లో ఉంటూ పని చేయాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్
- సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ పాలకవర్గాలకు ఆత్మీయ సన్మానం

సిరిసిల్ల రూరల్/సిరిసిల్ల టౌన్, జనవరి 24: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మున్సిపాలిటీలను ఒక ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసి, ఆదర్శంగా తీర్చిదిద్దామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్ స్పష్టం చేశారు. ఈ మేరకు సిరిసిల్లలోని తెలంగాణ భవన్‌లో శుక్రవారం సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ పాలకవర్గాలకు నిర్వహించిన ఆత్మీయ సత్కార కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. కేసీఆర్ చిన్నా, పెద్దా తేడా లేకుండా అన్ని మున్సిపాలిటీలకు నిధులు అందించారన్నారు. 30 ఏండ్ల తర్వాత కూడా 2014 నుంచి తొమ్మిదన్నరేండ్ల పాలననే ప్రజలు గుర్తుంచుకుంటారని చెప్పారు. కానీ, కాంగ్రెస్ వచ్చిన కొన్ని రోజుల్లోనే నిధులు విడుదల కాకుండా చేశారని మండిపడ్డారు. అసెంబ్లీ ఎన్నికలకు ఆరు నెలల ముందు సిరిసిల్ల అభివృద్ధి కోసం మున్సిపల్ మంత్రిగా రూ.40 కోట్ల నిధులు మంజూరు చేస్తే కాంగ్రెస్ వచ్చి వాటిని నిలిపివేసిందన్నారు. ఇంత దుర్మార్గపు ప్రభుత్వాన్ని చూడలేదన్నారు. ఆరు గ్యారెంటీలు వంద రోజుల్లో అమలు చేస్తామని మాట తప్పిందన్నారు. మాటలు కోటలు దాటినయ్ కానీ, చేతలు గడప దాటలేదని ఎదేవా చేశారు. ఇప్పుడు జరుగుతున్న గ్రామ సభల్లో ప్రజలు తిరగబడుతున్నారని, కాంగ్రెస్ వాళ్లు కనిపిస్తే కొట్టాలన్నంత కోపంలో ఉన్నారని తెలిపారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత 13 నెలల్లోనే ₹1.40 లక్షల కోట్ల అప్పులు చేసి ఒక్క అభివృద్ధి పని కూడా చేయలేదని మండిపడ్డారు. గతంలోనే ప్రజాపాలన నిర్వహించి కోటి 60 లక్షల దరఖాస్తులు తీసుకున్నామని చెప్పిన సీఎం రేవంత్, మళ్లీ గ్రామ, వార్డు సభల పేరుతో ఎందుకు దరఖాస్తులు తీసుకుంటున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. దరఖాస్తుల కోసం పెట్టే ఖర్చులతో జిరాక్స్ సెంటర్లకు గిరాకీ పెరిగింది తప్ప ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. ''గుడ్లు పీకి గోటీలు ఆడుతాం.. పేగులు తీసి మెడలేకుంటాం.. అని డైలాగ్‌లు కొట్టడం సులభమే కానీ, ప్రజలకు ఇచ్చిన హామీలు అమలుచేసి చూపాలి'' అని హితవుపలికారు. ప్రశ్నించిన వారిని ఇబ్బందులకు గురిచేయడమే లక్ష్యంగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పని చేస్తున్నదని మండిపడ్డారు. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన వారిని, సంక్షేమ పథకాల గురించి అడిగిన వారిపై కేసులు పెడుతూ ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. అసెంబ్లీ ఎన్నికలు ఇంకా నాలుగేండ్లు ఉన్నాయని, పనిపై దృష్టి పెట్టాలని హితవుపలికారు. రేవంత్‌రెడ్డి వందశాతం రుణమాఫీ చేశామని చెప్తే మరో పక్క రైతు రుణ మాఫీ కాలేదని సీనియర్ నాయకుడు, మంత్రి దామోదర రాజనరసింహనే చెబుతున్నారని తెలిపారు. మంత్రులు గాలి మోటర్లు ఎక్కి గాలి తిరుగుళ్లు తిరుగుతున్నారని, ప్రజల్లోకి వెళ్లేందుకు కిందికి దిగడం లేదని ఎద్దేవాచేశారు. కోటి 67 లక్షల మంది ఆడబిడ్డలు మహాలక్ష్మి కోసం ఎదురు చూస్తున్నారన్నారు. రాబోయే రోజుల్లో కేసీఆర్ మరోసారి ముఖ్యమంత్రి అవుతారని ధీమా వ్యక్తం చేశారు. తాను సిరిసిల్లలోని పలు వార్డుల్లో తిరిగానని, కేసీఆర్‌పై గానీ, మనపైగానీ అభిమానం పోలేదని, ఎప్పుడు ఎన్నికలు వచ్చినా మనకే ఓటు వేసేందుకు ఎదురు చూస్తున్నారని తెలిపారు. పోయింది అధికారం మాత్రమేనని, అభిమానం చెక్కుచెదరలేదని స్పష్టం చేశారు. పదవులు ముగిసినప్పటికీ కౌన్సిలర్లు తమ వార్డులో అందుబాటులో ఉండాలని, మళ్లీ గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. పని చేసే నాయకులను ప్రజలు వదులుకోరని, గాడిదలను చూస్తేనే గుర్రాల విలువ తెలుస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, మున్సిపల్ వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, అర్బన్ బ్యాంకు చైర్మన్ రాపెల్లి లక్ష్మీనారాయణ, వైస్ చైర్మన్ అడ్డగట్ల మురళి, సెస్ డైరెక్టర్ దార్నం లక్ష్మీనారాయణ, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, బీఆర్ఎస్ నాయకులు ఏనుగు మనోహర్‌రెడ్డి, రామతీర్థపు రాజు, న్యాలకొండ రాఘవరెడ్డి, బొల్లి రామ్మోహన్, మ్యాన రవి, సత్తార్, సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ పాలకవర్గ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

### మళ్లీ గులాబీ జెండా ఎగరవేద్దాం



వేములవాడ మున్సిపాలిటీపై మరోసారి గులాబీ జెండాను ఎగరవేద్దాం. గత పాలకవర్గం హయాంలో బీఆర్ఎస్ ప్రభుత్వ సహకారంతో అనేక అభివృద్ధి పనులు చేశాం. కాంగ్రెస్ సర్కారు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేదు. బీఆర్ఎస్‌పైనే ప్రజల్లో విశ్వాసం ఉంది. ప్రజలందరి ఆశీర్వాదంతో ఇదే ఉత్సాహంతో పని చేసి మరోసారి విజయం కోసం ముందుకు సాగాలి. కేసీఆర్, కేటీఆర్ నాయకత్వంలో మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించి గులాబీ జెండా ఎగరవేద్దాం.

- చల్మెడ లక్ష్మీనరసింహారావు, వేములవాడ బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి



మల్లాపూర్ మండలం మొగిలిపేట గ్రామ పంచాయతీ వద్ద పెట్రోల్ పోసుకోని ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతున్న మాజీ సర్పంచ్ నాగరాజును అడ్డుకుంటున్న పోలీసులు

# పెండింగ్ బిల్లుల కోసం

## మాజీ సర్పంచ్ ఆత్మహత్యాయత్నం

- ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆందోళన
- కాంగ్రెస్ నేతలకే పథకాలు అందిస్తున్నారని మండిపాటు
- అడ్డుకుకొని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- నాగరాజుకు ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల పరామర్శ
- ఎక్స్ వేదికగా స్పందించిన మాజీ మంత్రి హరీశ్‌రావు

మల్లాపూర్, జనవరి 24: పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరుతూ మాజీ సర్పంచ్ గ్రామ సభ సాక్షిగా ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్యకు యత్నించాడు. శుక్రవారం మొగిలిపేటలో తహసీల్దార్ వీర్‌సింగ్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. అధికారులు అర్హుల జాబితా చదివి వినిపించగా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డులు, ఆత్మీయ భరోసా పథకాలకు అనర్హులను ఎంపిక చేశారంటూ గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే సమయంలో కాంగ్రెస్ సర్కార్ ప్రజా సమస్యలను గాలికి వదిలేసిందని, ఏడాది పాలనలో ప్రజలకు చేసిందేమీ లేదని మాజీ సర్పంచ్ వనతడపుల నాగరాజు ధ్వజమెత్తాడు. ఆ పార్టీ నేతలు సూచించిన వారి పేర్లే సంక్షేమ పథకాల జాబితాలో వచ్చాయని ఆరోపించాడు. గ్రామంలో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన సుమారు ₹18లక్షల పెండింగ్ బిల్లులను ఏడాది గడిచినా చెల్లించడం లేదని మండిపడ్డాడు. మాజీ సర్పంచులు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. కాంగ్రెస్ సర్కార్‌ది ప్రజాపాలన కాదు, రాక్షస పాలనని ఆగ్రహించాడు. అనంతరం జీపీ కార్యాలయం ద్వారం వద్ద ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన ఎస్ఐ రాజు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది మాజీ సర్పంచ్‌ను అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. అక్కడి నుంచి పోలీస్ వాహనంలో స్టేషన్‌కు తరలించారు.

### స్పందించిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే

విషయం తెలిసిన వెంటనే కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల మల్లాపూర్‌కు చేరుకొని మాజీ సర్పంచ్ నాగరాజును పరామర్శించారు. బీఆర్ఎస్ నాయకులకు ఉన్న పోరాట పటిమ ఎవరికీ ఉండదని.. ప్రజా సమస్యల పరిష్కారం కోసం తమగళం వినిపించాలని సూచించారు. అనంతరం ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఎక్స్ వేదికగా మాజీ మంత్రి హరీశ్‌రావు స్పందించారు. మాజీ సర్పంచ్ నాగరాజు గ్రామ సభలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడడం బాధాకరమని పోస్ట్ చేశారు.

# అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం



24 గంటల మంచినీటి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్, కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్, రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మేయర్ యాదగిరి సునీల్‌రావు

కరీంనగర్ కార్పొరేషన్, జనవరి 24 : కేంద్ర పట్టణాభివృద్ధి, విద్యుత్, గృహ నిర్మాణ శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ శుక్రవారం కరీం'నగరం'లో పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం చేశారు. స్మార్ట్‌సిటీ నిధులతో చేపట్టిన మల్టీపర్పస్ స్కూల్ పార్క్, అంబేద్కర్ స్టేడియంలో నిర్మించిన స్పోర్ట్స్ కాంప్లెక్స్, హౌసింగ్‌బోర్డు రిజర్వాయర్ పరిధిలో 24 గంటల మంచినీటి సరఫరా, ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన ఈ-క్లాస్ రూంలను కేంద్ర హోం సహాయ శాఖ మంత్రి బండి సంజయ్‌కుమార్, రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌గౌడ్, మాజీ మంత్రి స్థానిక ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మేయర్ యాదగిరి సునీల్‌రావుతో కలిసి ప్రారంభించారు. అనంతరం హౌసింగ్‌బోర్డు కాలనీలో మేయర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మనోహర్‌లాల్ ఖట్టర్ మాట్లాడారు. స్మార్ట్‌సిటీ పథకాన్ని అన్ని నగరాల కంటే కరీంనగర్‌లో సమర్థవంతంగా, సక్రమంగా వినియోగించుకున్నారని, మిగతా పట్టణాలతో పోలిస్తే కరీంనగర్‌లో స్మార్ట్‌సిటీ పనులు చాలా బాగా జరిగాయని కితాబునిచ్చారు. కరీంనగర్‌లోని ఐదు డివిజన్లలో 4055 ఇళ్లకు 24 గంటల పాటు నిరంతరాయంగా తాగునీటిని సరఫరా అందించడం ఒక చారిత్రాత్మకమైన విజయమన్నారు. దేశంలో ఎక్కువ ఇళ్లకు 365 రోజులపాటు 24 గంటల తాగునీటిని అందించిన ఘనత కరీంనగర్ కార్పొరేషన్‌కు దక్కుతుందన్నారు. కరీంనగర్‌లో ప్రధాన సమస్యగా ఉన్న డంప్‌యార్డును క్లీన్ చేసేందుకు కేంద్ర నుంచి పూర్తి స్థాయిలో నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు మానేర్ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు గురించి మాజీ మంత్రి గంగుల కమలాకర్ వివరించారు. అంతర్జాతీయ స్థాయిలో పర్యాటకంగా అభివృద్ధి చేయాలన్న ఆలోచనతో మానేరు నదిపై అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ₹500 కోట్లతో మానేరు రివర్ ఫ్రంట్ ప్రాజెక్టును ప్రారంభించిందని, దీనిని పూర్తి చేసేందుకు ₹300 కోట్ల నిధులు విడుదల చేయాలని కోరారు. ఈ మేరకు వినతిపత్రం అందించారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధుల మేరకు అభివృద్ధి పనులు పూర్తి చేశామని చెప్పారు.

## కార్పొరేటర్‌గా కలగన్నా..
# ఎమ్మెల్యేగా పూర్తి చేశా: గంగుల



కరీంనగర్‌లో 24 గంటల మంచినీటి సరఫరా చేయాలని తాను కార్పొరేటర్ కలగన్నానని, మంత్రిగా ఉన్నప్పుడు ఈ పనులకు సంబంధించి భూమిపూజ చేశానని, ఇప్పుడు ఎమ్మెల్యేగా దానిని పూర్తి చేయడం ఆనందంగా ఉందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తెలిపారు. తాను ఎమ్మెల్యేగా అనుకున్న లక్ష్యం మేరకు 24 గంటల మంచినీటి సరఫరా అందిస్తున్నందుకు చాలా గర్వంగా ఉందన్నారు. తాను కార్పొరేటర్‌గా ఉన్నప్పుడు తాగునీటిలో కలుషిత నీరు వస్తుందన్నానని, అది రాకుండా ఉండాలంటే 24 గంటల మంచినీటి సరఫరా ఉండాలని అనుకున్నామన్నారు. దీనిపై కర్ణాటకలోని ధార్వాడ, నాగపూర్, బ్యాంకాంక్ వెళ్లి పరిశీలించినట్లు చెప్పారు. తాను ఎమ్మెల్యే అయిన తర్వాత ప్రజలకు 24 గంటల పాటు మంచినీటిని సరఫరా చేయాలని అప్పుడే నిర్ణయించుకున్నానని గుర్తు చేశారు. ఎమ్మెల్యే అయిన తర్వాత అప్పటి సీఎం కేసీఆర్, కేటీఆర్‌ని కలిసి ఈ విషయమై కోరానని తెలిపారు. దీనికి వారు అనుమతి ఇచ్చారని, ఇప్పుడు అది సాధ్యమైందన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో మొట్టమొదటగా 24 గంటల మంచినీటి సరఫరా ఇస్తున్న నగరంగా కరీంనగర్ నిలిచిందన్నారు. ఇది కరీంనగర్ ప్రజలకు గర్వకారణమన్నారు. మంచినీరు కలుషితం కాకుండా ఉండాలంటే 24 గంటలు ఆ పైపులైన్లలో నీరు ఉండాలని, దీనివల్ల ఆరోగ్య సమస్యలు రావని తెలిపారు. 24 గంటల మంచినీటి సరఫరా తమ చేతుల మీదుగా మొదలుకావడం అదృష్టంగా భావిస్తున్నామని పేర్కొన్నారు. స్మార్ట్‌సిటీలో భాగంగా నగరంలోని 4 వేలకు పైగా ఇళ్లకు పైలెట్ ప్రాజెక్టు కింద 24 గంటల సరఫరా చేపట్టామని, దీనిని నగరవ్యాప్తంగా విస్తరించేందుకు రూ.300 కోట్ల నిధులు అవసరం అవుతాయని కేంద్ర మంత్రి ఖట్టర్‌కు విన్నవించారు. అభివృద్ధి చిరస్థాయిగా నిలిచి ఉంటుందని, దీని కోసం మంత్రులు కృషి చేయాలన్నారు. దక్షిణ భారత దేశంలో మొదటి కేబుల్ బ్రిడ్జి కరీంనగర్‌లో నిర్మించామని, మానేరు రివర్ ఫ్రంట్ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## రేషన్‌కార్డు లేదాయె..
# పెన్షన్ రాదాయె..

- అధికారులను నిలదీసిన అత్తాకోడళ్లు
- బొప్పాపూర్ గ్రామసభలో ఆగ్రహం



రేషన్‌కార్డు, పెన్షన్ ఇప్పించాలని వేడుకుంటున్న అత్తాకోడళ్లు

ఎల్లారెడ్డిపేట, జనవరి 24: ఎలాంటి ఆధారం లేని తమ కుటుంబానికి పింఛన్, రేషన్‌కార్డు ఇంకెప్పుడు ఇస్తారంటూ బొప్పాపూర్ గ్రామ సభలో వేముల రామవ్వ ఆగ్రహం వ్యక్తం చేసింది. శుక్రవారం బొప్పాపూర్‌లో గ్రామ సభ నిర్వహించగా, తన కోడలితో కలిసి అధికారులను నిలదీసింది. తన సమస్యలను ఏకరువు పెట్టుకున్నది. తన కొడుకు బాలు ఏడు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో చనిపోయాడని, తన కోడలు సంధ్య, ఇద్దరు పిల్లలు స్వేచ్ఛ(5), రియాన్ష్(3) రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేసింది. కోడలు వితంతు పింఛన్ కోసం, రేషన్ కార్డులో పిల్లల పేర్ల నమోదు కోసం అర్జీ పెట్టుకున్నదని చెప్పింది. కానీ, శుక్రవారం జరిగిన సభలో చదివిన జాబితాలో తమ పిల్లల పేర్లు రాలేదని వాపోయింది. వింతతు పెన్షన్ ఇంకెప్పుడు ఇస్తారంటూ ఆగ్రహించింది. రేషన్ కార్డులో పేర్ల నమోదు నిరంతరం జరుగుతుందని అధికారులు ఆమెను శాంతింపజేశారు.

# సర్వర్ డౌన్.. నిలిచిన పత్తి కొనుగోళ్లు



పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో నిల్వ ఉన్న పత్తి బస్తాలు

పెద్దపల్లి, జనవరి24: ఈ -నామ్ సర్వర్ డౌన్ కావడంతో పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో పత్తి కొనుగోలు ప్రక్రియ నిలిచింది. శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆన్‌లైన్ సేవల కోసం రైతులు ఎదురు చూశారు. సేవలు అందుబాటులోకి రాకపోవడంతో రైతులు ఆవేదన చెందారు. మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి దేవరాజు పృథ్వీరాజ్, ఆడ్తిదారులు రైతులకు సమస్యను వివరించి, శనివారం కొనుగోలు చేస్తామని, మార్కెట్ యార్డులోని పత్తికి భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చారు.